# ఇక 'స్థానిక' సంగ్రామం

## సర్పంచ్ ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు

- ఈ నెల 30లోగా పీఓ, ఏపీఓ వివరాలను టీ-పోల్‌లో నమోదు చేయాలని ఆదేశం
- జిల్లా అధికారులు సైతం ఎలక్షన్‌కు సన్నద్ధం
- పాత రిజర్వేషన్ ప్రకారమే ఎన్నికలు
- వార్డుకో పోలింగ్ స్టేషన్.. 9,500 మంది సిబ్బందికి విధులు
- జిల్లాలో 475గ్రామ పంచాయతీలు, 4,322 వార్డులు
- ఫిబ్రవరి 1న ముగియనున్న సర్పంచ్‌ల పదవీ కాలం



అర్వపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం

సూర్యాపేట, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ) : ఇటీవల అసెంబ్లీ ఎన్నికలు పూర్తికాగా.. ఆ వేడి తగ్గకముందే మరో ఎన్నికలకు రంగం సిద్ధమవుతున్నది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం సర్పంచ్ ఎన్నికలకు కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా ఎన్నికల్లో పాల్గొనడానికి అవసరమైన సిబ్బంది వివరాలను ఈ నెల 30 లోపు పంపించాలని ఆదేశించింది. ఈ మేరకు సోమవారం రాష్ట్ర ఎన్నికల సంఘం సెక్రటరీ అశోక్ కుమార్ జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. 2019 జనవరిలో సర్పంచులు బాధ్యతలు స్వీకరించారు. వచ్చే నెల 1తో పదవీకాలం ముగుస్తున్నది. టర్మ్ పూర్తయిన మూడు నెలలలోపే ఎన్నికలు నిర్వహించాలని నిబంధనలు చెబుతున్నాయి. దీంతో రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అధికారులు ఎలక్షన్‌కు సన్నాహాలు మొదలుపెట్టారు.

### 31 వరకు టీపోల్‌లో సమాచారం

పంచాయితీ ఎన్నికల కోసం కావాల్సిన అధికారులు, సిబ్బంది వివరాలను టీ పోల్‌లో నిక్షిప్తం చేయాల్సి ఉంది. ఇటీవల అసెంబ్లీ ఎన్నికలు పూర్తయినందున ఎన్నికల కోసం పని చేసిన పీఓలు, ఏపీఓలతో పాటు ఇతర సిబ్బంది వివరాలను ఈ నెల 31లోపు టీపోల్ సాఫ్ట్‌వేర్‌లో అప్‌లోడ్ చేయనున్నారు.

### వార్డుకో పోలింగ్ స్టేషన్...

సర్పంచ్ ఎన్నికలకు సంబంధించి వార్డుకో పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేయనున్నారు. పోలింగ్ స్టేషన్‌లో 200మందిలోపు ఓటర్లు ఉంటే ఒక ప్రిసైడింగ్ ఆఫీసర్, ఒక పోలింగ్ ఆఫీసర్‌ను నియమించనున్నారు. 201 నుంచి 400 మంది ఓటర్లుంటే ఒక ప్రిసైడింగ్, ఇద్దరు పోలింగ్ అధికారులు, 401 నుంచి 650 ఓటర్లుంటే ఒక ప్రిసైడింగ్ ఆఫీసర్, ముగ్గురు పోలింగ్ అధికారులు ఉండనున్నారు. 650 కంటే ఎక్కువ ఓటర్లుంటే రెండు పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలోని 475 పంచాయతీల ఎన్నికల కోసం జిల్లాలో సుమారు 9,500 మంది సిబ్బంది అవసరం కానున్నారు. ఎన్నికలు మూడు దశల్లో జరుగనున్నాయి. మొదటి దశలో పనిచేసిన సిబ్బంది.. మూడో దశలో కూడా విధుల్లో ఉంటారు.

### పాత రిజర్వేషన్ ప్రకారమే...

సర్పంచ్ ఎన్నికలు పాత రిజర్వేషన్ ప్రకారమే జరుగనున్నాయి. రిజర్వేషన్లు 10ఏండ్ల వరకు కొనసాగనున్న నేపథ్యంలో ఈసారి కూడా అదే అమలులో ఉంటుంది. ఇక ఓటరు జాబితాలో కూడా పెద్దగా మార్పులు ఉండే అవకాశం లేదు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఓటరు జాబితా రూపొందించారు. అయితే సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో కొత్త ఓటర్ల కలయిక, పాత ఓటర్ల తొలగింపు ప్రక్రియ కూడా ఉండనుంది.


జిల్లా అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావు

# 'వన సంపద'ను పూర్తి చేయాలి

**● కలెక్టర్ వెంకట్రావు**

సూర్యాపేట, డిసెంబర్ 6 : జిల్లాలో పెండింగ్‌లో ఉన్న వన సంపదలను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావు అధికారులను ఆదేశించారు. బుధవారం అదనపు కలెక్టర్ ప్రియాంకతో కలిపి వనసంపదలు, నర్సరీలు, ఉపాధి హామి పనులు, గ్రామ పంచాయతీల అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా వన సంపద పనులు వంద శాతం పూర్తి చేయాలన్నారు. గ్రామ పంచాయతీల్లో పెండింగ్‌లో ఉన్న నర్సరీలను సైతం వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఉపాధి హామీ కూలీల నమోదులో చివరి స్థానాల్లో ఉన్న వాటిని గుర్తించి ప్రతి గ్రామంలో 25 మంది కూలీలు తగ్గకుండా వచ్చే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధి హామీ పనులకు వచ్చే వారికి ఎస్ఎంఎంఎస్ ద్వారానే అటెండెన్స్ వేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గ్రామ పంచాయతీల్లో పన్నులను వసూలు చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఇప్పటి వరకు 22 శాతం మాత్రమే వసూలు అయ్యాయని, రాష్ట్ర వ్యాప్తంగా చివరి స్థానంలో ఉన్నామన్నారు. ప్రతి 15 రోజులకోసారి రివ్యూ చేస్తామని, ప్రగతి కనిపించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో జడ్పీసీఈఓ సురేశ్, డీఎఫ్ఓ సతీశ్‌కుమార్, డీఆర్‌డీఓ కిరణ్‌కుమార్, డీపీఓ యాదయ్య, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

# అవగాహనతో పెరిగిన ఓటింగ్ శాతం

సూర్యాపేట : దివ్యాంగులు ఓటు వేయాలని జిల్లాలో విస్తృత్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం వల్లనే వారి నుంచి 95.83 శాతం పోలింగ్ నమోదైందని కలెక్టర్ ఎస్.వెంకట్రావు తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో దివ్యాంగుల ఓటింగ్‌తో కూడిన బుక్‌లెట్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగులకు అన్ని వసతులు కల్పించామన్నారు. నియోజకవర్గాల వారీగా శిక్షణ కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా సూర్యాపేట నియోజకవర్గంలో 89 శాతం, తుంగతుర్తి 100, హుజూర్‌నగర్ 96, కోదాడ 96 శాతం పోలైనట్లు చెప్పారు. ఈ ఫలితాలు వచ్చేందుకు క్షేత్రస్థాయిలో ఆయాలు, అంగన్‌వాడీ టీచర్లు, సూపర్‌వైజర్లు, సీడీపీఓలు, జిల్లా సంక్షేమ శాఖ అధికారుల కృషి ఉందన్నారు. కార్యక్రమంలో డీడబ్ల్యూఓ జ్యోతి పద్మ, డీఈఓ అశోక్, డీఎంహెచ్ఓ కోటాచలం పాల్గొన్నారు.

# జిల్లా నుంచి ఇద్దరికి అమాత్యయోగం!

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. కానీ పార్టీ అధిష్టానం రేవంత్‌రెడ్డిని సీఎంగా ఖరారు చేసింది. సీఎంగా రేవంత్‌రెడ్డికి అవకాశం కల్పించడంతో ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి క్యాబినెట్‌లో కీలక మంత్రి పదవి దక్కనుందని తెలుస్తున్నది. ఆర్థిక శాఖ ఉత్తమ్‌కు కేటాయిస్తారన్న చర్చ ఆ పార్టీ వర్గాల్లో ఉన్నది. ఇక మరోవైపు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఎన్నికల ఫలితాల అనంతరం సీఎం పదవి గురించి ప్రస్తావించకుండా రేవంత్‌రెడ్డినే అర్హుడని ప్రకటించారు. దాంతో రేవంత్‌రెడ్డితో కలిసి క్యాబినెట్‌లో కీలక పాత్ర పోషించేందుకు సిద్ధమయ్యారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోరుకున్నట్లుగా ఆయనకు పట్టణాభివృద్ధి, మున్సిపల్ శాఖ కేటాయించవచ్చని తెలుస్తున్నది. గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మంత్రివర్గంలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఐటీ, ఓడరేవుల శాఖ మంత్రిగా పనిచేశారు. కిరణ్‌కుమార్‌రెడ్డి మంత్రి వర్గంలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. వీరిద్దరికీ ఈ సారి జిల్లా నుంచి మంత్రి పదవులు ఖాయం కాగా కేటాయించే శాఖలపై మాత్రం అధికారికంగా స్పష్టత రావాల్సి ఉన్నది. ఇక ఇదే సమయంలో రేవంత్‌రెడ్డి మంత్రివర్గంలో చేరిక పట్ల ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అయిష్టత చూపితే తన సతీమణి పద్మావతిపేరును సూచిస్తారన్న చర్చ సైతం కొనసాగుతున్నది. ఇదే సమయంలో సామాజిక కోణంలో ఆలేరు నుంచి గెలుపొందిన బీర్ల అయిలయ్య, దేవరకొండ నుంచి గెలుపొందిన నేనావత్ బాలూనాయక్‌ల పేర్లు కూడా మంత్రి పదవుల చర్చలో ఉన్నాయి. రాష్ట్రంలో గొల్లకుర్మ సామాజిక వర్గం నుంచి గెలుపొందిన ఏకైక ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కావడంతో ఆయనకు ఆ కోటాలో అవకాశం లేకపోలేదన్న చర్చ ఉన్నది. మంత్రివర్గంలో గొల్లకుర్మలకు తప్పకుండా ప్రాతినిధ్యం కల్పించాలనుకుంటే మాత్రం తొలిసారి గెలుపొందిన అయిలయ్య అత్యంత అదృష్టవంతుడేనని రాజకీయవర్గాలు పేర్కొంటున్నాయి. ఇక ఎస్టీ సామాజిక వర్గం లంబాడీల నుంచి గెలుపొందిన ఇద్దరిలో బాలూనాయక్ సీనియర్ కావడంతో ఆయన పేరు సైతం చర్చల్లో ఉన్నట్లు తెలిసింది. ములుగు నుంచి గెలుపొందిన సీతక్కకు మంత్రి పదవి ఖాయం కాగా ఆమె ఆదివాసీ. ఒక వేళ లంబాడీలకు తప్పనిసరిగా కల్పించాలంటే మాత్రం బాలూనాయక్‌కు కూడా అవకాశం లేకపోలేదని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఉమ్మడి జిల్లా నుంచి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తప్పనిసరి కాగా ఇదే జిల్లా నుంచి మరో ఒకరిద్దరికి ఛాన్స్ అంటే మంత్రివర్గ సమీకరణల్లో అంత ఈజీ కాకపోవచ్చని భావిస్తున్నారు. ఇదే జరిగితే సీఎం పదవి కాకుండా మిగిలిన 17 మంత్రి పదవుల్లో ఒకే జిల్లాకు నాలుగు అసాధ్యమే. మునుగోడు నుంచి గెలుపొందిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి మంత్రి వర్గంలో కాకుండా ప్రభుత్వంలో మరో కీలక స్థానం దక్కుతుందన్న ప్రచారం జరుగుతున్నది. గురువారం మధ్యాహ్నం రేవంత్‌రెడ్డితోపాటు మంత్రివర్గం మొత్తం ప్రమాణస్వీకారం చేస్తుందా? లేదా? ప్రస్తుతం కొందరేనా? అన్న దాంట్లో ఇంకా స్పష్టత రావాల్సి ఉన్నది. కాగా నేటి సీఎం, మంత్రివర్గ ప్రమాణ స్వీకారానికి జిల్లా నుంచి పెద్ద ఎత్తున తరలి వెళ్లేందుకు కాంగ్రెస్ శ్రేణులు సిద్ధమయ్యారు.


### ఆర్థిక సాయం

ఆత్మకూరు(ఎం), డిసెంబర్ 6 : మండలంలోని కూరెళ్లకు చెందిన మేకల లలిత బుధవారం అనారోగ్యంతో మృతి చెందింది. మృతురాలి కుటుంబానికి గ్రామ సర్పంచ్ బాషబోయిన ఉప్పలయ్య రూ.5 వేల ఆర్థికసాయం అందజేసి సానుభూతి తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఎరుకల స్వామిగౌడ్, గడ్డం అశోక్, యువజన విభాగం మండల కార్యదర్శి నిమ్మనగోటి గణేశ్, రైతు బంధు సమితి గ్రామ కోఆర్డినేటర్ కొత్తోజు యశ్వంత్‌కుమార్, మణికుమార్ పాల్గొన్నారు.

# విద్యా ప్రమాణాల పెంపునకు కృషి చేయాలి

**● డీఈఓ భిక్షపతి**

త్రిపురారం, డిసెంబర్ 6: ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపునకు కృషి చేయాలని జిల్లా విద్యాధికారి (డీఈఓ) భిక్షపతి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యా యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు అర్థమయ్యేలా బోధనను చేపట్టాలని అన్నారు. అలాగే ప్రభుత్వ యాప్‌లో విద్యార్థులకు నిర్వహించిన పరీక్షల ఫలి తాలను పొందుపరచాలని ఆదేశించారు. ఉపాధ్యా యులు చేపట్టే బోధనలపై జిల్లా, రాష్ట్ర స్థాయిలో బృందాలతో పర్యవేక్షణ చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బాలాజీ నాయక్, నోడల్ అధికారి రవి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


త్రిపురారం: సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ భిక్షపతి

### బోధనలో మెళకువలు పాటించాలి

దామరచర్ల: ఉపాధ్యాయులు బోధనలో మెళకువలు పాటించాలని దిలావర్‌పూర్ హెచ్ఎం కేతావత్ సైదానాయక్ అన్నారు. మండలంలోని దిలావర్ పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దామరచర్ల, అడవిదేవులపల్లి, వేములపల్లి, మిర్యాలగూడ మం డలాల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల తెలుగు భాషా ఉపాధ్యాయుల సముదాయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ ఉపాధ్యాయులు నిరంతరం అభ్యసిస్తేనే విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించవచ్చని అన్నారు. ఉపాధ్యాయులు తమ మేధస్సుకు పదను పెట్టి తెలుగుభాషలో విద్యార్థులను నిష్ణాతులుగా తీర్చిదిద్దాలని కోరారు. రిసోర్స్ పర్సన్ గుడిపాటి కోటయ్య, ఉప్పల పద్మ, నందికొండ చంద్రయ్య, రావిరాల అంజయ్య, నాలుగు మండలాల తెలుగు భాషా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


దామరచర్ల: మాట్లాడుతున్న దిలావర్ జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం సైదానాయక్


విద్యార్థిని అభినందిస్తున్న స్కూల్ యాజమాన్యం

### ఇన్‌స్పైర్‌లో విద్యార్థిని ప్రతిభ

మిర్యాలగూడ: 2022-23 విద్యా సంవత్సరంలో కేంద్రం తలపెట్టిన ఇన్‌స్పైర్ (జూనియర్ శాస్త్రవేత్త) ఆవిష్కరణలో లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న మద్దెల వెన్నెల ప్రతిభ చాటిందని ఆ స్కూల్ హెచ్ఎం జయరాజన్, భౌతి కశాస్త్ర ఉపాధ్యాయుడు గులాంజహంగీర్ బుధ వారం తెలిపారు. వెన్నెల అనే విద్యార్థిని రూపొందించిన ఎలక్ట్రో మ్యాగ్నటిజం అనే ప్రతిపాదనకు ఎంపికైంది. ఈ విధానంలో ఎలక్ట్రిక్ ఫీల్డ్ ద్వారా మ్యాగ్నటిక్ ఫీల్డ్‌ను ఉత్పత్తి చేయడం, దీని వల్ల ఎలక్ట్రో క్రెన్స్‌లలో, రిఫ్రిజిలేటర్లలో, పవర్ ఫుల్ మోటార్స్, హై ఆర్‌పీఎంలలో ఉపయోగపడుతుందన్నారు. ఈ ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక విభాగం వారు ఉత్తమమైన ఆవిష్కరణగా ఎంపిక చేశారని వారు తెలిపారు. ఈ సందర్భంగా వెన్నెలను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.